

ప్రజాభవన్‌లో 11న ప్రజావాణి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 8 : హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో ప్రతీ మంగళవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని 10వ తేదీకి బదులుగా 11వ తేదీన నిర్వహించనున్నట్టు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న ప్రజాభవన్‌లో ముఖ్యమైన సమావేశం ఉన్నందున ప్రజావాణిని 11కు వాయిదా వేసినట్టు తెలిపారు. అర్జీలు అందజేసే వారు బుధవారం రావాలని కలెక్టర్ సూచించారు.

మహాగణపతిం మనసాస్మరామి

- కొలువుదీరిన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి, సెప్టెంబరు 8 : సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వివిధ రూపాల్లో, ఆకృతుల్లో గణనాథులు కొలువుదీరారు. వినాయక చవితి సందర్భంగా శనివారం ఉదయం నుంచే డప్పుచప్పుళ్లు, భక్తి పాటలతో, ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించి వినాయక విగ్రహాలను మండపాల వద్దకు చేర్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన మండపాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలు, చమ్కీలతో మండపాలను శోభాయమానంగా అలంకరించడంతో రాత్రి వేళల్లో కన్నులపండువగా దర్శమిస్తున్నాయి. భక్తులు ఇళ్లల్లోనూ బుజ్జి గణపయ్యలను ప్రతిష్ఠించి విఘ్నాలు తొలగించు వినాయకా అంటూ పూజించారు. పదకొండు రోజుల పాటు వేడుకలు ఘనంగా కొనసాగనున్నాయి.



మెదక్‌లోని పంచముఖి వినాయకుడు



మహరాజ్ అవతారంలో దర్శనమిస్తున్న మెదక్ పట్టణంలోని ముత్యాలమ్మ గణనాథుడు





రామాయంపేటలోని వివేకానంద విద్యాలయంలో కొలువైన మట్టి గణపతి, నారాయణఖేడ్‌లో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదియోగి మండపం

గణపయ్యకు జగ్గారెడ్డి కుటుంబం పూజలు





గంజిమైదాన్‌లోని గణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న నిర్మలారెడ్డి, జయారెడ్డి, దత్తుసాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణపయ్య వద్ద జయారెడ్డి, దత్తుసాయిరెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 8: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. సంగారెడ్డిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పాటు గంజిమైదాన్‌లో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకులకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలారెడ్డి కూతురు జయారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో జగ్గారెడ్డి పర్యటన

- నేడు నాలుగు శాఖల అధికారులు సందర్శించాలని సూచన
- వరద నీటిని దిగువకు తరలించాలని ఆదేశం
- రెవెన్యూ కాలనీ, ఎర్రకుంట, శ్రీచక్రకాలనీ, రామచంద్రకాలనీ ప్రజలకు భరోసా

సంగారెడ్డి, సెప్టెంబర్ 8 : వరద ప్రభావానికి గురైన సంగారెడ్డి పట్టణంలోని ఎర్రకుంట, శ్రీచక్రకాలనీ, రామచంద్రకాలనీ, రెవెన్యూకాలనీల్లో ఆదివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పర్యటించారు. మోకాళ్ల లోతు నీళ్లల్లో దిగి వరద ముంపులో ఉన్న ఇళ్లను పరిశీలించారు. నీటిని దిగువకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, పబ్లిక్‌హెల్త్ శాఖల అధికారులు సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ప్రాంతాల్లో ఉండాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఎక్స్‌కవేటర్‌తో నీటిని కిందకు గండికొట్టాలని ఆయన పేర్కొన్నారు. శ్రీచక్రకాలనీలో పైపులతో కల్వర్టు నిర్మించాలని సూచించారు. కాగా ప్రతీ ఇంటికి వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందించాలని కోరారు. ఈ సందర్భంగా పలు ఇళ్లలోకి వెళ్లి ప్రజలకు జగ్గారెడ్డి భరోసా కల్పించారు.





సంగారెడ్డి పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

జలమయం

- సంగారెడ్డిలో చెరువులను తలపిస్తున్న కాలనీలు
- ర్యాకల్ పెద్దచెరువు కుడి కాల్వకు బుంగ
- ఇంటి పైకప్పు కూలి ఒకరు.. వరదలో కొట్టుకుపోయి మరొకరు మృతి

సంగారెడ్డి రూరల్/కంది/నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, సెప్టెంబరు 8 : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అతలాకుతలం అవుతుంది. సంగారెడ్డిలోని పలు కాలనీలు జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. పట్టణంలోని రెవెన్యూ కాలనీ, ల్యాండ్ సర్వే కాలనీలతో పాటు ఇతర ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు చేడంతో ఇళ్లలోకి నీరు చేరింది. రోడ్లపై మోకాళ్ల లోతు నీరు ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వినాయక చవితి పండుగకు పూజ చేద్దామన్నా సామగ్రి తెచ్చుకునేందుకు వెళ్లలేక ఇంట్లోనే బందీలుగా ఉండిపోయామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బురద నీటిలోనే వెళ్లి నిత్యావసర వస్తువులను తెచ్చుకుంటున్నారు. కంది మండలంలో శని, ఆదివారాల్లో ఎడతెరిపి లేని వాన కురిసింది. చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లాయి. కాశీపూర్, కలివేముల, చిమ్నాపూర్, ఎర్ధనూర్ తదితర గ్రామాల్లో పొంగిపొర్లుతున్న అలుగుపై రాకపోకలు సాగించలేక ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎర్ధనూర్ నుంచి ఎర్ధనూర్ తండాకు వెళ్లే దారిలోని వాగు అలుగు పారుతుండడంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలను సంగారెడ్డి రూరల్ పోలీసులు నిలిపివేశారు. ఆదివారం ఆర్డీవో రాజు, తహసీల్దార్ విజయలక్ష్మి, గ్రామాలను సందర్శించి చెరువులు, కుంటలను పరిశీలించారు. కందిలోని కిసాన్‌సాగర్ చెరువు పరిధిలోని కాలువలో ప్రవహిస్తున్న వరదనీరు జాతీయరహదారిపైకి వెళ్లకుండా మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ పెద్దచెరువు కుడి కాల్వకు బుంగ ఏర్పడడంతో, రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చెరువు కింద దాదాపు 280 ఎకరాల వరకు పంట సాగు అవుతుందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని ముక్తాపూర్‌తోపాటు గౌడ్‌గాం జన్‌వాడ తదితర గ్రామాల్లో పత్తి, సోయాబీన్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.



సంగారెడ్డిలో నీట మునిగిన రెవెన్యూ కాలనీ

కూలిన ఇళ్లు

కోహీర్/కొండాపూర్/మనోహరాబాద్/పెద్దశంకరంపేట/హవేళీఘణపూర్ : వర్షాలకు పలుచోట్ల ఇళ్లు కూలగా, మరికొన్ని చోట్ల పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కోహీర్ మండలంలో 14 ఇళ్లు కూలినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మద్రిలో 3, పీచేర్యాగడి తండాలో 2, గురుజువాడ, పర్శపల్లి, మాచిరెడ్డిపల్లి, కవెల్లి, ఖానాపూర్, పోతిరెడ్డిపల్లి, దిగ్వాల్, చింతలఘట్టు, బిలాల్‌పూర్‌లో ఒక్కో ఇల్లు కూలింది. బాధితులకు ఒక్కొక్కరికి రూ.6,500 పరిహారం అందించనున్నట్లు తహసీల్దార్ బాలశంకర్ తెలిపారు. గురుజువాడ గ్రామంలో గొల్ల స్వరూప ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో ప్రభుత్వం రూ.1.30 లక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కొండాపూర్ మండల పరిధిలోని అలియాబాద్, సైదాపూర్‌లో శనివారం రెండు ఇళ్లు కూలిపోయాయి. అలీయాబాద్‌లో సూర్యపేట రాజు ఇంటిపైకప్పు, గోడలతో సహా కుప్పకూలిపోయింది. సైదాపూర్ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్న కిరణ్‌కమార్ ఇంటి గోడ కూలింది. మనోహరాబాద్ మండలంలో కూలిన ఇళ్లను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. మండలంలో 13 ఇళ్లు దెబ్బతిన్నాయని, పరిహారం అందించేందుకు కలెక్టర్‌కి ప్రతిపాదనలు పంపించామని తహసీల్దార్ పేర్కొన్నారు. పెద్దశంకరంపేట మండలంలో దెబ్బతిన్న 14 ఇళ్లను ఆదివారం తహసీల్దార్ గ్రేస్‌బాయ్ పరిశీలించారు. వీరికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. హవేళిఘణపూర్ మండలంలో 25 ఇళ్లు పాక్షికంగా, ఒకటి పూర్తిస్థాయిలో కూలింది. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మండల కేంద్రంలో దెబ్బతిన్న ఇళ్లను ఆదివారం పరిశీలించారు.

ఇద్దరి మృతి

న్యాల్‌కల్/టేక్మాల్ : న్యాల్‌కల్ మండలంలోని అమీరాబాద్ గ్రామానికి చెందిన రవీందర్(35) చాల్కి-చీకూర్తీ మధ్యలో ప్రవహించే నవటవాగులో వరద ఉధృతిలో శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తూ కొట్టుకుపోయాడు. శనివారం ఉదయం పొలాలకు వెళ్తున్న గ్రామస్థులకు వాగు ఒడ్డుపై రవీందర్ శవమై కనిపించగా కుటుంబీకులకు సమాచారమిచ్చారు. టేక్మాల్ మండల కేంద్రంలో శనివారం రాత్రి ఇంటి పైకప్పు కూలి పడుకున్న మంగలి శంకరమ్మ(63)పై పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది..

'సింగూరు'కు పోటెత్తిన వరద

పుల్కల్, సెప్టెంబరు 8 : సింగూరు ప్రాజెక్టుకులోకి 27,192 కూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో ప్రాజెక్టు 6వ నంబరు క్రస్ట్‌గేట్‌ను మీటరున్నర ఎత్తి దిగువన ఉన్న మంజీర రిజర్వాయర్‌లోకి వదులుతున్నారు. క్రస్ట్ గేట్ గుండా 8,142 క్యూసెక్కులు, రెండు జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,744 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి దిగువకు మొత్తం 10,521 క్యూసెక్కుల వరద తరలుతుంది. శనివారం వరద పోటెత్తడంతో 11వ నంబరు గేటును ఎత్తారు. వరద ప్రవాహం మళ్లీ తగ్గడంతో ఆదివారం ఉదయం మూసివేసారు. ప్రాజెక్టు వద్ద 7.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండు జలవిద్యుత్ టర్బైన్లు చురుకుగా పనిచేస్తున్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్ సదాశివపేట, జోగిపేట పట్టణాల్లోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పవర్ గ్రిడ్‌లకు సరఫరా అవుతున్నది.

మంజీర రిజర్వాయర్ మూడు గేట్లు ఎత్తివేత

ఎగువన ఉన్న సింగూరు ప్రాజెక్టు నుంచి 10,886 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం మంజీర రిజర్వాయర్‌కు వస్తున్నది. రిజర్వాయర్‌కు 25,070 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రిజర్వాయర్ మూడు క్రస్ట్ గేట్లు, ఒక స్కవర్ గేట్‌ను ఎత్తారు. స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తి 1,069 క్యూసెక్కులు, 2, 7, 8వ నంబరు క్రస్ట్ గేట్లను మూడు మీటర్లు ఎత్తి 8,622 క్యూసెక్కులను వదిలారు. అవుట్‌ఫ్లో 26,935 క్యూసెక్కులు నమోదైంది. మంజీర రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1,651 అడుగులకు 1,500 ఎంసీఎఫ్‌టీలు కాగా, 1,206 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉన్నది.

పొంగిపొర్లుతున్న నల్లవాగు, పోచారం

కల్హేర్/హవేళిఘణపూర్ : సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టుకు ఆదివారం భారీ వరద ప్రవాహం కొనసాగింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1493 అడుగులకు చేరుకున్నది. శనివారం 4,260 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ఆదివారం 1,586 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా 8 చెరువులను, ఎడమ కాలువ కింద రెండు చెరువులకు నీరు విడుదల చేశారు. మెదక్- కామారెడ్డి జిల్లాల సరిహద్దులోని పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతుండగా, ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు సందడి చేశారు.



పోచారం అలుగు నీటిలో పర్యాటకులు











సంగారెడ్డిలో బురద నీటిలో వెళుతున్న మహిళలు, కొండాపూర్ మండలం అలీయాబాద్‌లో కూలిన ఇల్లు, నాగల్‌గిద్దమండలం గౌడ్‌గాంజన్‌వాడ శివారులో సోయాబీన్ చేనులో నీళ్లు, సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ సమీపంలో వాలిన వరి, సిర్గాపూర్ మండలంలో అలుగు పారుతున్న నల్లవాగు

రూ.25 కోట్ల తండా రోడ్ల నిధులు రద్దు

- ఇతర నియోజకవర్గాలకు తరలించారంటూ బీఆర్ఎస్ ఆరోపణలు
- నర్సాపూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య రచ్చ

నర్సాపూర్, సెప్టెంబరు 8 : నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు గిరిజన తండాలకు బీటీ రోడ్ల కోసం గత ప్రభుత్వంలో మంజూరైన సుమారు రూ.25 కోట్ల నిధులు రద్దు కావడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య రచ్చ సాగుతుంది. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉందన్న ఉద్దేశంతో కావాలనే రద్దు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారంటూ బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని నర్సాపూర్, శివ్వంపేట, మాసాయిపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్, హత్నూర మండలాల్లోని పలు తండాలకు బీటీ రోడ్ల కోసం రూ.25.53 కోట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్టీ ఎస్‌డీఎఫ్ ఫండ్ నుంచి మంజూరు చేశారు. అందులో నర్సాపూర్ మండలంలో మొత్తం ఏడు పనులకు రూ.7.81 కోట్లు, శివ్వంపేట మండలంలో పలు పనులకు రూ.9.36 కోట్లు, కౌడిపల్లి మండలంలో రూ.8.36కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులకు సంబంధించి ఇప్పటివరకు నాలుగు సార్లు టెండర్లు వేశారు. గత ప్రభుత్వంలో బిల్లులు సకాలంలో రావడం లేదని కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనడానికి ఆసక్తి చూపలేదని అధికార వర్గాల ద్వారా తెలిసింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా సునీతారెడ్డి ఉన్నందున కావాలనే కక్ష పూరితంగా ఆ నిధులను ఇతర నియోజకవర్గాలకు మళ్లించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్య ఏకంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి సైతం మీడియా సమావేశంలో గిరిజన తండాలకు బీటీ రోడ్ల కోసం ఎస్టీ ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన నిధులను కాంగ్రెస్ ఓడినందునే, కావాలనే మళ్లించారంటూ విమర్శించారు.

ఎర్రబారుతున్న తెల్లబంగారం

- పత్తి పంటకు తెగుళ్ల బెడద



మెదక్, సెప్టెంబరు 8 : వర్షపు నీటికి చేలలో పత్తి మొక్కలు వాలిపోతున్నాయి. అనేక గ్రామాల్లో పంటకు ఎర్ర తెగులు సోకుతోంది. మెదక్ జిల్లాలో 36,155 ఎకరాల్లో పత్తి పంట సాగువుతున్నది. సాధారణానికి మించి వానలు కురుస్తుండడంతో పత్తి పంటకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. పత్తి పంట పూతరాలి ఎర్రబారుతోంది. దాంతో మొక్క కుళ్లిపోతోంది. పత్తి కాయలూ రాలిపోతున్నాయి. మొక్కలు వాడుముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి. ఒకసారి తెగులు సోకిందంటే పంట తొలగించడం తప్ప వేరే మార్గం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి కాయలు కాసే సమయంలో పంట ఇలా వాడిపోవడం పట్ల ఆందోళన చెందుతున్నారు. జూన్, జూలైలో వేసిన పత్తి పంట ఆగస్టు కల్లా కాయలు పగలడం ప్రారంభమవుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వానలకు కాయలు నల్లబారి, పక్వానికి రాక ముందే నేలరాలుతున్నాయి. రోజుల తరబడి వానలు పడడంతో పంట పొలాలలో నీరు నిలిచిపోతోంది. ఎండలు రాకపోవడం, వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో తడిసిన పత్తి కాయలు ఆరడం లేదు. దాంతో తేమకు అవి నల్లబారుతున్నాయి. కొన్ని చోట్ల కాయ పగిలి బయటకు వచ్చిన పత్తి నల్లబారుతోందని రైతులు చెబుతున్నారు. పంటకు తెగులు సోకడానికి అనేక కారణాలలో అధిక వర్షాలూ ఒకటని, సరైన పోషకాలు అందకపోయినా తెగుళ్లు సోకుతాయని, సస్య రక్షణ చర్యలు సకాలంలో చేపడితే తెగుళ్లను అరికట్టవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

33 శాతం నష్టం వాటిల్లితేనే పరిహారం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటనష్టం వాటిల్లితే అందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. కానీ పంట నష్టం 33 శాతానికి తగ్గకుండా ఉంటేనే పరిగణనలోకి తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ తెలిపింది. జిల్లాలో ఆ మేరకు హవేళీఘనపూర్ మండలంలో 180 ఎకరాలలో వరికి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పత్తి రైతులకు ప్రభుత్వం నుండి సాయం అందే పరిస్థితి లేనట్లేనని రైతులు వాపోతున్నారు.

డెంగ్యూతో జీజీహెచ్ సెక్యూరిటీగార్డు మృతి



జీవన్‌కుమార్(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8: డెంగ్యూతో జీజీహెచ్ సెక్యూరిటీ గార్డు మృతిచెందాడు. సంగారెడ్డి మండలం కలబ్‌గూర్‌కు చెందిన ఎ.జీవన్ కుమార్(24) జ్వరంతో బాధపడుతూ ఈనెల 6న జీజీహెచ్‌లో అడ్మిట్ అయ్యాడు. వైద్య పరీక్షలు జరిపిన డాక్టర్లు తెల్లరక్తకణాలు పడిపోతున్నాయని సూచించడంతో జీవన్‌కుమార్‌ను ఐసీయూలో చేర్చి రెండు ప్యాకెట్ల ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. ఆయన ఆరోగ్యంలో ఎలాంటి మార్పురాకపోవడంతో కుటుంబసభ్యులు జీవన్‌కుమార్‌ను అదేరోజు సాయంత్రం హైదరాబాద్ మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 7న మృతిచెందాడు. జీవన్‌కుమార్ సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.

అవసరాలను ఆసరాగా చేసుకుని అఘాయిత్యం

- గర్భం దాల్చిన బాలిక
- ముగ్గురు యువకుల అరెస్ట్

దుబ్బాక, సెప్టెంబరు 8: కుటుంబ అవసరాలను ఆసరాగా చేసుకుని బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట ఏసీపీ జీ.మధు తెలిపారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో ఓ కుటుంబం నివాసముంటోంది. దుబ్బాకకు చెందిన ఓ యువకుడు, భూంపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఆ కుటుంబ అవసరాలను ఆసరాగా చేసుకుని బాలిక(14)ను సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం చేసుకున్నారు. ఈ క్రమంలో ఒకరికి తెలియకుండా ఒకరు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చడంతో తల్లిదండ్రులు దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ముగ్గురు యువకులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఏసీపీ మధు తెలిపారు. ఆయనతో పాటు దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు ఉన్నారు.

ప్రమాదకరంగా ఇళ్ల మధ్య నీటి కుంట


మద్రి గ్రామంలో ఇళ్ల మధ్యన నీటి కుంట

కోహీర్, సెప్టెంబరు 8: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మద్రి గ్రామంలో ఇళ్ల మధ్యన నీటి కుంట ప్రమాదకరంగా ఉన్నది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో కుంట నీటితో పూర్తిగా నిండింది. ఇళ్ల మధ్యన కుంట ఉండటం వల్ల మూగ జీవాలు, చిన్నపిల్లలు అందులో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఈ నీటి కుంటలో గ్రామానికి చెందిన ఓ బాలుడు పడి మృతిచెందాడు. అయినా ఆ కుంటను పూడ్చేందుకు అధికారులు ఏమాత్రం చొరవ చూపడం లేదని స్థానికులు తెలిపారు. ఇళ్ల మధ్యన నీటి కుంట ఉండటం వల్ల చుట్టుపక్కల ఇళ్లవారు భయాందోళన చెందుతున్నారు. మురుగు, వరద నీటితో నిండి ఉన్న కుంటలో ఈగలు, దోమల వ్యాప్తి చెంది అనారోగ్యాల బారినపడతామని వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈ నీటి కుంట పాఠశాలకు అతి సమీపంలో ఉండడం వల్ల చిన్న పిల్లలు ఆడుకునేందుకు వెళ్లి అందులో పడిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు తెలియజేసినా.. ఇప్పటివరకు కుంటను పూడ్చలేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ కుంటను మూసేసి, ఏదైనా భవనం నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.



సంగారెడ్డిలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన హస్తకళా మేళాలో అమ్మకానికి ఉంచిన చేనేత వస్త్రాలు, దుస్తులు, కళాకారులు తయారు చేసిన వస్తువులు

చేనేత హస్తకళా మేళా.. భళా

- కళాభారతి ఆధ్వర్యంలో టీటీడీ మండపంలో ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న హస్తకళా ఉత్పత్తులు
- నెలరోజులపాటు చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8: సంగారెడ్డిలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటున్నది. అఖిల భారత హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకం పేరిట ఏర్పాటు చేసిన ఈ మేళా ఈనెల 1న ప్రారంభించగా, ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నది. అంతరించిపోతున్న హస్తకళలకు ఆజ్యం పోయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఈ మేళాలో హస్తకళా ఉత్పత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తుండగా, కళాకారులచే నేరుగా విక్రయిస్తున్నారు.

200 రకాల చేనేత వస్తువుల ప్రదర్శన, అమ్మకం

ప్రపంచ ప్రసిద్ధి చెందిన సుమారు 200కు పైగా హస్తకళలు, చేనేత వస్త్రాలను ఈ మేళాలో ప్రదర్శనగా ఉంచారు. పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, వరంగల్, వెంకటగిరి, మంగళగిరి, చీరాల, ఉప్పాడ, కంచి, ధర్మవరం, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, బెడ్‌షీట్స్, టవల్స్ వంటి ఎన్నో రకాల చేనేత వస్త్రాలు ఈ మేళాలో ప్రదర్శించి విక్రయిస్తున్నారు. ఇవేకాకుండా మన దేశంలోనే పేరెన్నికగన్న కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, నిర్మల్‌టాయిస్, హైదరాబాద్ మంచి ముత్యాలు, మైసూర్ రోజ్‌వుడ్, సహారన్‌పూర్ వుడ్ కార్వింగ్, వరంగల్ లెదర్ బ్యాగులు, బంజార ఎంబ్రాయిడరీ, బెంగాల్ జ్యూట్ బ్యాగ్స్ ఇలాంటి ఎన్నో ప్రసిద్ధిచెందిన వస్తువులు, వస్త్రాలను అందుబాటులో ఉంచారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంతోమంది కళాకారులు ఉమ్మడిగా ఏర్పడి వస్త్రాలు, వస్తువులను తయారుచేసి ప్రదర్శనలో ఉంచి విక్రయాలను జరిపి జీవనోపాధి పొందుతున్నారు. అంతరించిపోతున్న హస్తకళలను ప్రజలు ప్రోత్సహించి, కళాకారులకు జీవనోపాధినిస్తూ, వారి కళా నైపుణ్యతకు సృజనాత్మకతను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కళాభారతి అధ్యక్షులు ప్రసాదరావు కోరారు.


ప్రదర్శనలోని వస్తువులు

గాడిద పాల విక్రయంతో ఉపాధి

నారాయణఖేడ్, సెప్టెంబరు 8: గాడిద పాలను విక్రయిస్తూ కర్ణాటకలోని ఔరాద్‌కు చెందిన రత్నమ్మ అనే మహిళ ఉపాధి పొందుతోంది. గాడిద పాలు తాగించడం వల్ల చిన్నారులకు జలుబు, జ్వరంతో పాటు మొగుళ్ల జబ్బు, పెద్దవారికి కూడా నొప్పులు తగ్గుతాయని, అందువల్ల గాడిద పాల ఔషధ గుణం తెలిసినవారు కొనుగోలు చేస్తారని ఆమె తెలిపింది. తమ వద్ద ఉన్న పెంపుడు గాడిదను తీసుకొని గ్రామాల్లో తిరుగుతూ అవసరమైన వారికి అక్కడికక్కడే 5 ఎంఎల్ బాటిల్‌లో పాలను రూ.150 చొప్పున విక్రయిస్తామన్నారు. గాడిద పాల విశిష్టత తెలిసిన వారే కొనుగోలు చేస్తారని, పట్టణ ప్రాంతాల్లో ఎవ్వరూ కొనుగోలు చేయరని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ పాలను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నట్లు రత్నమ్మ పేర్కొన్నది.


ఖేడ్‌లో గాడిద పాలు విక్రయిస్తున్న రత్నమ్మ



వినాయక చవితిని పురస్కరించుకుని పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని తన ఇంటి ఆవరణలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ సతీసమేతంగా పాల్గొన్నారు.

- పటాన్‌చెరు రూరల్

హోరాహోరీగా చదరంగం పోటీలు

● రాష్ట్రస్థాయికి ఎనిమిది మంది క్రీడాకారుల ఎంపిక



చదరంగం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 8: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్-11 బాలిబాలక విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన అక్షిత, ప్రీతిజోష్న అనన్య, అనివిత, సాయిసాత్విక్‌గౌడ్, ఆశ్రిత్, విశ్వక్‌సేనగౌడ్, తేజగౌడ్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ఈ నెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాషస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని వెల్లడించారు. ప్రతిభ కనబరిన క్రీడాకారులకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ మాధవరెడ్డి బహుమతులు అందజేశారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు..

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20 బాలబాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మిగితా వివరాలకు 9963005540 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీసీ కమిషన్ సభ్యురాలిగా బాలలక్ష్మి



చేర్యాల, సెప్టెంబరు 8 : తెలంగాణ ఉద్యమ బిడ్డ రంగు బాలలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించింది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన ఆమె తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జేఏసీ నాయకురాలిగా తనదైన శైలితో గళంవిప్పి చెరగనిముద్ర వేసుకుంది. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన బాలలక్ష్మి సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన సమయంలో ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఏఐసీసీ ఎల్‌డీఎం కో-ఆర్డినేటర్‌గా, పార్లమెంటు ఎన్నికల సమయంలో భువనగిరి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారుల కోటాలో జనగామ టికెట్ ఆశించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీసీ కమిషన్ సభ్యురాలిగా అవకాశమివ్వగా ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై బాలలక్ష్మి మాట్లాడుతూ బీసీలు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు.

టీచర్లకు పాన్ ఇండియా ఐకానిక్ అవార్డులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8 : విద్యారంగంలో విశేషంగా కృషి చేసిన సంగారెడ్డి జిల్లాలోని నలుగురు ఉపాధ్యాయులను పాన్ ఇండియా ఐకానిక్ అవార్డులు వరించాయి. సిద్దారెడ్డి(తేర్పోల్ జడ్పీహెచ్ఎస్), చంద్రశేఖర్ (ఫసల్‌వాది జడ్పీహెచ్ఎస్), రాధిక(అందోల్ జడ్పీజీహెచ్ఎస్), అంజన(తడ్కల్ జడ్పీహెచ్ఎస్)లకు అవార్డులు దక్కాయి. సీబీఐ మాజీ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ నజీర్, వెస్ట్ ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా వారు సన్మానం పొందారు. సౌత్ ఇండియాలోని సుమారు ఆరు రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సన్మానం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైందని ఉపాధ్యాయులు తెలిపారు.

దామరకుంట ఉపాధ్యాయుడికి..



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మం

మర్కుక్, సెప్టెంబరు 8: సిద్దిపేట జిల్లాలోని దామరకుంట ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఏపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు సన్మానించి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

న్యాల్‌కల్, సెప్టెంబరు 8: బంగారాన్ని దొంగిలించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సంగన్న తనభార్య రుక్మిణితో కలిసి ఈ నెల 6న ద్విచక్రవాహనంపై న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామం వద్ద బీదర్‌కు వెళ్లే రహదారిపై ఇద్దరు వ్యక్తులు వారిని వెంబడించి ఖలీల్‌పూర్ గ్రామానికి చేరుకోగానే గ్రామం చివరలోని వైకుంఠధామం వద్ద అడ్డగించి రుక్మిణి మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పారిపోయారు. సంగన్న ఫిర్యాదు మేరకు హద్నూర్ సీఐ జక్కుల హన్మంతు, ఎస్‌ఐలు రామానాయుడు, నరేష్ పూర్తి వివరాలను తెలుసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆదివారం న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ చౌరస్తా వద్ద సయ్యద్‌మహ్మద్(హాక్‌కాలనీ-బీదర్), షేక్‌నదియాల్(బీదర్) అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఆటోదిగి రుక్మాపూర్‌కు నడిచివెళ్తున్న క్రమంలో పోలీసులు వారిని పట్టుకున్నారు. అనంతరం బాధితుడు సంగన్న చెప్పిన పోలికల ఆధారంగా విచారించగ తామే దొంగిలించామని ఒప్పుకున్నారన్నారు. ఈ మేరకు వారి వద్ద మూడున్నర తులాలబంగారం(పుస్తెలతాడు), బజాజ్‌పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వనదుర్గామాతకు పూజలు



అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద భక్తుల తాకిడి

పాపన్నపేట, సెప్టెంబరు 8 : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం వద్ద వారం రోజులుగా వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఆలయాన్ని మూసివేసిన సంగతి విదితమే. అర్చకులు రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించడంతో ఆలయం వద్ద సందడి నెలకొన్నది. పలువురు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బారికేడ్ల వద్ద నిల్చుని వరద ప్రవాహాన్ని వీక్షించారు.

పలుకుబడుల భాష.. సాంస్కృతిక ప్రతీక

నేడు తెలంగాణ భాషా దినోత్సవం

జోగిపేట, సెప్టెంబరు 8: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించినప్పటి నుంచీ సెప్టెంబరు 9న తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. 'పలుకుల భాష కాదు... పలుకుబడుల భాష కావాలి' అని ప్రకటించిన తెలంగాణ సాంస్కృతిక ప్రతీక, కవి, భాషా ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా అధికారికంగా జరపాలని 2014 సెప్టెంబరు 9న వరంగల్‌లో నిర్వహించిన కవి కాళోజీ శత జయంత్యుత్సవాల్లో అప్పటి ప్రభుత్వాధినేతగా కేసీఆర్ ప్రకటించారు. అప్పటి నుంచీ సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. 2015 నుంచీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఈ ఉత్సవాలను జరపడం, అదేరోజు కవి కాళోజీ సాహిత్య పురస్కార ప్రదానం చేయడం ప్రారంభమైంది.

గతమెంతో ఘనం..

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణ దేవరాయలు పొగిడినా, 'ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్' అని నికోలాయిడ్ చేత పిలువబడ్డా, సీపీ బ్రౌన్ 'మధురమైన తెలుగు' అన్నా, పాల్కురికి సోమనాథుడు 'జాను తెలుగు' అన్నా అవన్నీ గతంలోనే. ఐక్యరాజ్య సమితి సాంస్కృతిక విభాగం (యునెస్కో) ప్రకారం ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో తెలుగుది 13వ స్థానం. దేశంలో హిందీ తరువాత ప్రజలు మాట్లాడే రెండో అతి పెద్ద భాష కూడా తెలుగే. కొంతకాలం క్రితం.. తెలుగుభాషకు ప్రాచీన భాష హోదా దక్కింది. అదే సమయంలో అంతరించాల్సిన భాషలో తెలుగుభాషను చేర్చే సమయం ఆసన్నమైందని అదే 'యునెస్కో' హెచ్చరించడం ఎంతో విచారించదగ్గ విషయం. ఆత్మీయతను ప్రతిబింబించే అమ్మ, నాన్న, తాత, నానమ్మ, అమ్మమ్మ, మామయ్య, అత్త, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు లాంటి తెలుగు పదాలను వీడి ఇంగ్లీష్ మోజులో మమ్మీ, డాడీ సంస్కృతికి బానిసలైపోతున్నాం. ఇంగ్లీష్ యాసలో తెలుగును 'టెల్గూ' అనీ, హైదరాబాద్‌ను 'హైడ్రా బ్యాడ్' అనీ ఉచ్చరించడం నాణానికి ఇంకో పార్శ్వంగా చెప్పుకోవచ్చు. మాతృభాషను విస్మరిస్తున్నామంటే అమ్మను మరిచిపోతున్నామన్న మాట. మమ్మీ, డాడీ సంస్కృతిని వీడి అమ్మ, నాన్న (నాయన) లాంటి మధురమైన తెలంగాణ పదాలను వాడేలా పిల్లల్ని ప్రోత్సహిస్తూ ఆ పిలుపుల్లోని మాధుర్యాన్ని పిల్లలకు అర్థం చేయాలి. సాధ్యమైనంత వరకూ తెలంగాణ పదాలనే వాడుతూ ఒక పదిని మిషాలు మాట్లాడేలా పిల్లలను ఉత్సాహపరుస్తూ వారిలో భాషా నైపుణ్యాన్ని పెంచుతూ, భాష పట్ల మోజును పెరిగేలా ప్రోత్సహించాలి.

మాతృభాషను మృత భాషగా మార్చొద్దు..



తంపులూరి ఇందిర

గణపతి ఇందిర, తెలుగు భాషోపాధ్యాయురాలు మాతృభాషను మృత భాషగా చేయడంలో 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా అందరూ బాధ్యులే. ఇప్పటికే రోజు రోజుకూ ఆదరణ తగ్గుతున్న తెలుగు మాటలను అందరూ బతికించుకోవాలి. ఇది ప్రతీ ఇంటి నుంచి మొదలుకావాలి. ప్రతీ ఇంటిలోనూ తప్పనిసరిగా తెలుగులోనే మాట్లాడాలి. ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో పిల్లలను చేర్పినా వారికి తప్పనిసరిగా తెలుగును బోధిస్తూ, తెలుగులో మాట్లాడేలా తీర్చిదిద్దాలి. ఇక, అధికార భాషా సంఘం, తెలుగు విశ్వవిద్యాలయం, ప్రభుత్వం కూడా తెలుగుకు పునర్‌వైభవం దక్కేలా ప్రయత్నించాలి. అస్తిత్వాన్ని కోల్పోతున్న అమ్మ భాషను కాపాడుకోవడానికి అనుసరించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపైనా ఉన్నది. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళల్లో తమ మాతృభాషకు అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు పెద్దపీట వేస్తుంటే మన రాష్ట్రంలోని ప్రభుత్వం, ప్రజలు పరాయి భాష మోజులో పడి మాతృభాషను చంపుకోవడం శోచనీయం. ఇది మారాలి. ఈ మార్పు ప్రతీ వారి ఇంటిలోనుంచే మొదలుకావాలి. జీవన పోరాటంలో ఇంగ్లిష్ భాష తప్పనిసరి అయినా, ఇంటిలో తప్పకుండా తెలుగు మాటలను మాట్లాడేలా పిల్లలను ప్రోత్సహించాలి.

సాహిత్యంతో మానవ జీవితం సుసంపన్నం

● ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

సదాశివపేట, సెప్టెంబరు 8: సాహిత్యం మానవ జీవితాన్ని సుసంపన్నం చేస్తుందని ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం సదాశివపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో (అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక-వికారాబాద్, సదాశివపేట మిత్ర బృందం) ఆధ్వర్యంలో నిర్వహించిన కాళోజి జయంతి-తెలంగాణ భాషాదినోత్సవం-కవి సమ్మేళనం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాహిత్యం సమాజ చైతన్యం కోసం సాగే నిరంతరప్రక్రియ అన్నారు. సాహిత్యం కవి గుండె లోతుల్లో నుంచి పుట్టుకురావాలన్నారు. సాహిత్యానికి కులం, మతం, ఏదీ అడ్డు కాదన్నారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న తన ఆట, పాట, మాటలతో రక్తి కట్టించారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్తలు ఏనుగు నర్సింహారెడ్డి, తుల్జారాంసింగ్, నర్సింహులుగుప్తా మాట్లాడుతూ కాళోజి తెలుగు యాస, సంస్కృతుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రజలను చైతన్యవంతుల్ని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కుమారుడు చింతా సాయినాథ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణపాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్, వందల మంది యువసాహితీ కళాకారులు పాల్గొన్నారు.

రుణమాఫీలో తప్పుడు సమాచారం

● ఐదుగురు సీఈవోలపై వేటుకు రంగం సిద్ధం

నారాయణఖేడ్, సెప్టెంబరు 8: రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఐదుగురు సీఈవోలపై ప్రభుత్వం వేటుకు రంగం సిద్ధం చేసింది. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో 12 సహకార సంఘాలు ఉండగా, ప్రస్తుతం 6 సీడెడ్ సహకార సంఘాలు ఉన్నాయి. గతంలో 8 సీడెడ్ సహకార సంఘాలు ఉంటే, క్రిష్ణాపూర్, బొక్కస్‌గాం సహకార సంఘాలను సహకార బ్యాంకు పరిధిలోకి విలీనం చేశారు. 2017లో ఎస్‌బీహెచ్‌ను ఎస్‌బీఐలో విలీనం చేయడంతో, అప్పటి నుంచి సీడెడ్ సహకార సంఘాల పరిధిలోని రైతులకు కొత్త రుణాలు తీసుకోవడం, పాతవి రెన్యూవల్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2018 నుంచి 2023 డిసెంబరు వరకు రుణాలుపొందిన వారికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేస్తున్నది. ఈ నేపథ్యంలో ఖేడ్ పరిధిలోని సంజీవన్‌రావుపేట్, గంగాపూర్, మార్డి, కడ్పల్, కల్హేర్ సొసైటీల సీఈవోలు రైతులకు రుణమాఫీ వర్తించాలనే ఉద్దేశంతో ఈ సొసైటీల పరిధిలోని రైతులు 2019లో రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వానికి సమాచారమిచ్చారు. దీనిపై సహకారశాఖ డైరెక్టర్ ఇటీవల విచారణ జరిపించగా.. ఐదు సహకారశాఖ సీఈవోలు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలింది. దీంతో కడ్పల్, సంజీవన్‌రావుపేట్, కల్హేర్, మార్డి, గంగాపూర్ సహకార సంఘాల సీఈవోలను సస్పెండ్ చేయాలని సహకార శాఖ డైరెక్టర్.. జిల్లా సహకార అధికారికి సూచించినట్లు తెలిసింది. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ఆరు సీడెడ్ సొసైటీలలో దాదాపు 2600 మంది రైతులకు రూ.11 కోట్ల పై చిలుకు రుణమాఫీ వర్తించకుండా పోయింది. టీబీపేట సైతం సీడెడ్ సొసైటీగా ఉన్నప్పటికీ, ఆ సొసైటీ సీఈవో మాత్రం తప్పుడు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. మార్డి సొసైటీ సీఈవో ఇప్పటికే సస్పెండ్‌లో ఉండడంతో మిగతా నలుగురిపై త్వరలో వేటు పడనున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఖేడ్ డివిజన్ సహకార శాఖ అధికారి చిన్నారావును సంప్రదించగా.. ఐదుగురిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినప్పటికీ, మార్డి సీఈవో ఇప్పటికే సస్పెండ్‌లో ఉన్నారని, మిగతా వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



పరిశోధకులతో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ అభయ్ కరాండీకర్

ఐఐటీహెచ్ పరిశోధనలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలి

● కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ అభయ్ కరాండీకర్

● ఐఐటీహెచ్‌లో సాతి సెంటర్, డిజిటల్ హెరిటేజ్ ల్యాబ్ ప్రారంభం

కంది, సెప్టెంబరు 8: ఐఐటీహెచ్ పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ అభయ్ కరాండీకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం డీఎస్‌టీ- సాతి సెంటర్ (అధునాతన విశ్లేషణ, సాంకేతిక సహాయ సంస్థ)ను, డిజిటల్ హెరిటేజ్ ల్యాబ్‌లను ఆయన ప్రారంభించారు. దీనికి ఇన్-సిటు కోరిలేటివ్ మైక్రోస్కోపీ సెంటర్ మద్దతు ఉన్నది. ఈ సాతి సెంటర్ అత్యాధునిక మైక్రోస్కోపీ పద్ధతులను ఉపయోగించి వినూత్న పరిష్కారాలపై సహకరించడానికి సైన్స్‌లోని వివిధ విభాగాల్లోని శాస్త్రవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భౌతికశాస్త్రాలు, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, ఔషధ అధ్యయనాలతో సహా విస్తృత శ్రేణి శాస్త్రీయ విభాగాల నుంచి శాస్త్రవేత్తలను ఒకచోట చేర్చి, అధునాతన మైక్రోస్కోపీ పద్ధతులను ఉపయోగించడం ద్వారా మాత్రమే పరిష్కరించగల సాధారణ శాస్త్రీయ లక్ష్యాలను పరిష్కరించడానికి సాతి సెంటర్ ఉద్దేశించబడింది. డీఎస్‌టీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాజీ)కి రూ.60 కోట్ల నిధులతో పాటు 17 విద్యా, పారిశ్రామిక, పరిశోధన సంస్థల సహకారం ఉంది. ఈ సందర్భంగా అభయ్ కరాండీకర్ మాట్లాడుతూ దేశంలోని పరిశోధన ఆవిష్కరణల పర్యావరణల వ్యవస్థలను మెరుగు పరచడానికి ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరిలో పరిశోధన సంస్కృతిని పెంపొందించడానికి దేశవ్యాప్తంగా అత్యాధునిక పరిశోధన మౌలిక సదుపాయలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచస్థాయి పరిశోధనలు కేంద్ర సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఐఐటీహెచ్‌లో టీహాన్ ప్రాంగణంలో డ్రోన్ల ప్రదర్శనలు, త్రీడీ టెక్నాజీని ఆయన పరిశీలించారు. బీవీఆర్ మోహన్‌రెడ్డి (చైర్మన్ బోర్డ్ ఆఫ్ గవర్నన్స్ చైర్మన్, ఐఐటీ హైదరాబాద్), ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్.మూర్తి, ప్రొఫెసర్. బి.జగదీశ్వరరావు (వైస్ ఛాన్సలర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం), డాక్టర్ కృష్ణ ఎల్లా (చైర్మన్ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్), అన్ని భాగస్వామ్య సంస్థల అధిపతులు హాజరయ్యారు. వినూత్న సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో ఐఐటీ హైదరాబాద్ ముందంజలో ఉందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

నాణ్యత లేని బియ్యం మాకొద్దు

అల్లాదుర్గం సెప్టెంబరు 8: నాణ్యతలేని బియ్యం మాకొద్దు అంటూ మండలంలోని రాంపూర్ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. రేషన్ దుకాణం ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతగా లేవని, ముక్కిపోయి దుర్వాసన వస్తున్నాయని తెలిపారు. నాణ్యతలేని బియ్యాన్ని వెంటనే మార్చేయాలంటూ నిరసన తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని కోరారు.



అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి వచ్చిన రేషన్ బియ్యాన్ని చూపిస్తూ ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

అత్తింటి వేధింపులు తాళలేక

నవవధువు ఆత్మహత్య



శైలజ(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 8: అత్తింటివారి వేధింపులు తాళలేక నవ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వాడి గ్రామానికి చెందిన ఇమ్మడి శైలజ(19) గ్రామంలోని బలిజ సుధీర్ అనే వ్యక్తిని ప్రేమించి, గ్రామస్థుల సహకారంతో మూడునెలల క్రితం పెళ్లి చేసుకుంది. కాగా, పుట్టింటి నుంచి వరకట్నం తేవాలని, నీ వల్ల బంధువులందరూ దూరమయ్యారని తిడుతూ శైలజను కొన్ని రోజులుగా భర్తతోపాటు అత్త సువర్ణ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. శైలజ ఈ విషయాన్ని తన అన్న రామకృష్ణకు చెప్పడంతో రూ.లక్ష ఇచ్చారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో మనస్తాపం చెందిన శైలజ పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు మొదటగా మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి సిరిసిల్లా జిల్లాలోని ఎల్లారెడ్డిపేట హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలి అన్న రామకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పాపం పసికందు

● అప్పుడే పుట్టినబిడ్డను చెత్తకుప్పలో పడేసిన వైనం

● చికిత్స అందించి మాతా శిశుకేంద్రానికి అప్పగింత

దుబ్బాక, సెప్టెంబరు 8: మానవత్వం మంటగలిసింది.. నవమాసాలు మోసిన బిడ్డను పుట్టగానే గుర్తు తెలియని వ్యక్తులు చెత్త కుప్పలో పారేశారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం తిమ్మాపూర్ బుడగజంగాల కాలనీలోని ముళ్లపొదల్లో పసికందు ఏడుపులు వినిపించాయి. గ్రామస్థులు అక్కడికి వెళ్లి చూడగా.. అప్పుడే పుట్టిన మగ పసికందు కనిపించింది. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు అక్కడికి చేరుకుని ఆ పసికందును సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మాతా శిశుకేంద్రానికి అప్పగించారు. పసికందు ఆరోగ్యం నిలకడగానే ఉందని, విచారణ జరుపుతున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బైకును ఢీకొట్టిన లారీ

● యువకుడికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన ఒగ్గు శ్రీనివాస్

శివ్వంపేట, సెప్టెంబరు 8: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సుభాష్‌పల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గంగయ్య పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు శ్రీనివాస్(21) ద్విచక్ర వాహనంపై తూప్రాన్ వెళ్తుండగా గుర్తుతెలియని లారీ వెనుక నుంచి ఢీకొంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ కూడా బైకును ఢీకొనడంతో శ్రీనివాస్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కటుంబ సభ్యులు తెలిపారు.

కాలుజారి చెరువులో పడి రైతు మృతి



కరుణాకర్(ఫైల్)

నిజాంపేట, సెప్టెంబరు 8: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి రైతు మృతిచెందాడు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన రైతు రెడ్డి కరుణాకర్(28) శనివారం సాయంత్రం తన వ్యవసాయ పొలానికి యూరియా చల్లి చేతులు కడుక్కోవడానికి సమీపంలోని బ్రాహ్మణ చెరువుకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అతడి తండ్రి రెడ్డి ఎల్లయ్య చెరువు వద్దకు వెళ్లి చూడగా చెప్పులు, బట్టలు చెరువు వద్దే ఉన్నా కరుణాకర్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కలవారి సహాయంతో చెరువులో వెతకగా కరుణాకర్‌రెడ్డి మృతదేహం లభించింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల మేరకు బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ బాబుల్(30) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం తన బంధువు దిల్‌నవాజ్‌తో కలిసి బైకుపై రాయాయంపేటకు బయలుదేరారు. కావేరీ స్టీల్ పరిశ్రమ సమీపంలో ఓ లారీని వెనక నుంచి వీరి బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో బాబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆదివారం అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

శివ్వంపేట, సెప్టెంబరు 8: గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలను పగులగొట్టి 40 తులాల వెండి, నగదును అపహరించుకుపోయిన సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లపల్లితండాకు చెందిన బడావత్ లక్ష్మి శివ్వంపేటలో అద్దె ఇంట్లో నివాసముంటోంది. వినాయక చవితి పండుగకు తాళ్లపల్లితండాకు వెళ్లడంతో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలను పగులకొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేసి 40 తులాల వెండి రూ.22 వేల నగదును తస్కరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

బీరప్ప ఆలయంలో ..



ఆలయం బయట పగులగొట్టి ఉన్న హుండీ

మద్దూరు, సెప్టెంబరు 8 : మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామంలోని బీరప్ప ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం సాయంత్రం గ్రామస్థులు ఆలయం వద్దకు వెళ్లగా గేటుకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు హుండీ పగులగొట్టి బయట ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని కురుమ సంఘం సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో...

జిన్నారం, సెప్టెంబరు 8: జిన్నారం మండలం ఊట్ల పంచాయతీ దాదిగూడెంలో శనివారం రాత్రి బందం కొమ్ము మంజుల ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధిత మహిళ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా తాళం పగుల గొట్టిన దొంగలు 4 తులాల బంగారం, 20 తులాల వెండి అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న శ్రీరాంనగర్ కాలనీలో చోరీ చేసేందుకు వచ్చిన దొంగల కదలికలు స్థానిక సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ముఖాలకు మాస్కులు ధరించిన నలుగురు దొంగలు కాలనీలో సంచరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు.

కొండ చిలువ కలకలం

బెజ్జంకి, సెప్టెంబరు 8 : మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు పై శనివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. రోడ్డుపై పాకుతూ వెళ్తున్న కొండచిలువను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం కొండచిలువ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని చెట్లపొదల్లోకి వెళ్లింది. ఇటీవల వచ్చిన వరద నీటిలో కొట్టుకొచ్చి ఉంటుందని, ఫారెస్టు అధికారులు కొండచిలువను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బెజ్జంకిలో రోడ్డుపై కొండచిలువ..


సదాశివపేట: 12వ వార్డులో ఉషాకిరణ్‌యూత్ వినాయకుడి ప్రత్యేక పూజల్లో పులిమామిడిరాజు


కంది మండలం చిద్రుప్పలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


వట్‌పల్లిలో హనుమాన్ ఆలయం వద్ద వినాయకుడికి భక్తుల పూజలు


గుమ్మడిదల: రైతు సంఘం వద్ద ఫ్రెండ్స్ అసోసియేషన్ వినాయక మండపంలో పూజలు


పుల్‌కల్: కోర్పోలులో గణేష్ మండపం వద్ద పూజల్లో యువకులు, చిన్నారులు


కంగ్టిలో పూజలందుకున్న యోగిగణేష్


నాగల్‌గిద: గౌడ్‌గాం జన్‌వాడలో గణేషుడి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు


కల్హేర్‌లో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడి ప్రతిమకు పూజలు చేస్తున్న యువకులు

కొలువుదీరిన గణనాథులు


ఖేడ్‌లోని గజానన్ యూత్ మండపంలో గణేషుడికి ఎమ్మెల్యే దంపతుల పూజలు


నారాయణఖేడ్: వెంకటాపూర్‌లో పూజలు చేస్తున్నభక్తులు


కోహీర్‌లోని ఓంకార్ గణేష్ మండపంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


తూప్రాన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో భక్తుల పూజలు



చేగుంట: సీతారామ కాలనీలో భక్తుల పూజలందుకుంటున్న గణనాథుడు


సంగారెడ్డిలోని భవానినగర్ మండపంలో టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పూజలు


మెదక్‌పట్టణంలోని జేఎన్‌రోడ్డులో తొలి పూజలు అందుకుంటున్న గణనాథుడు


మెదక్‌పట్టణంలోని వీరహనుమాన్ కాలనీలో వినాయకుడికి భక్తుల పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో భారీ వినాయక ప్రతిమలు వివిధ రూపాల్లో కొలువుదీరాయి. పర్యావరణ హితంపై ముమ్మరంగా అవగాహన కల్పించడంతో ఇళ్లల్లోనూ ప్రజలు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించుకొని పండుగను జరుపుకున్నారు. పలుచోట్ల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. శనివారం ఉదయం నుంచే భారీ ప్రతిమలను వాహనాల్లో మండపాలకు తరలించడంతో రోడ్లు, వీధులు సందడిగా మారాయి. గణేష్ మండపాలను విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. రెండో రోజైన ఆదివారం గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది.

సదాశివపేట, సెప్టెంబర్ 8: వినాయక చవితి పర్వదిన వేడుకలను పట్టణంలోని వాడవాడలా, గ్రామాల్లో భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సదాశివపేటలోని 12వ వార్డులో ఉషా కిరణ్‌యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడికి ఆ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడిరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

● కంది/వట్‌పల్లి/జిన్నారం/గుమ్మడిదల/కల్హేర్: ఆయా మండలాల్లో శనివారం ఊరూరా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయా గ్రామాల్లో గణపయ్య కోసం ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పిల్లలు, పెద్దలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొనడంతో గణేశ్‌మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. పలువురు దాతలు ముందుకు వచ్చి అన్నదాన వితరణ చేపట్టారు. జిన్నారం మండలంలోని పారిశ్రామిక వాడల్లోనూ కార్మికులు వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు.

● పుల్‌కల్: ఉమ్మడి పుల్కల్ మండలంలో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన చౌటకూర్‌లోనే 30 గణేష్ విగ్రహాలను నెలకొల్పారు. చౌటకూర్‌లో వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అల్పాహారాన్ని పంచిపెట్టారు. కోర్పోలులో మారుతి యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

● కంగ్టి: కంగ్టిలోని గణేష్ మందిరంలో వరద గణేషుడికి వైభవంగాపూజలు జరిగాయి. యోగి గణేష్, సిద్ధి గణేష్, పాండురంగ గణేష్, హనుమాన్ గణేష్, ఇలా వాడవాడలా వివిధ రూపాల్లో వెలసిన గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

● నాగల్‌గిద్ద: మండలపరిధిలోని కరస్‌గుత్తి, గౌడ్‌గాం జన్‌వాడ, కారముంగి, తదితర గ్రామాల్లో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

● నారాయణఖేడ్: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని వినాయక ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ బస్టాండ్ ఎదుట గజానన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమ్మరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ ఆయన పూజలు నిర్వహించారు. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదియోగి భారీ ప్రతిమతో వినాయకుడి షెడ్డును ఏర్పాటు చేయడమే కాకుండా వినాయక విగ్రహాన్ని కూడా వినూత్నంగా ఏనుగు, గుర్రం, తాబేలు, మూషిక వాహనాలపై ఉండే విధంగా, కుబేరుడు, శివ పార్వతుల విగ్రహాలతో ఆకట్టుకునే విధంగా ప్రతిష్ఠించారు. మున్సిపల్ అధికారులు, ఎన్ఆర్ఐ గుర్రపు మశ్చందర్ ఫౌండేషన్, ఇంపాక్ట్ సంస్థ వారు వేర్వేరుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. నారాయణఖేడ్ డివిజన్‌పరిధిలో మొత్తం 532 వినాయక మండపాలు వెలిశాయి.

● కోహీర్: కోహీర్ మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 94 గణపతులను ప్రతిష్ఠించారు. ఆయా గ్రామాల్లో వివిధ రూపాల్లో గణనాథుడి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కోహీర్‌తో పాటు దిగ్వాల్, బిలాల్‌పూర్, తదితర గ్రామాలను ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

● రామచంద్రాపురం: మండల వ్యాప్తంగా మొత్తం 322 వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. ఇందులో రామచంద్రాపురం పట్టణంలో 220, తెల్లాపూర్ మున్సిపాలిటీలో 102 వినాయక మండపాల ఏర్పాటు చేశారు. పలు మండపాల్లో కార్పొరేటర్లు వి.సింధూఆదర్శరెడ్డి, పుష్పనగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెదక్ జిల్లాలో...

తూప్రాన్, సెప్టెంబరు 8: మండలంలో శనివారం వినాయక చవితి పండుగ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 170 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. అందులో సుమారు 60కిపైగా విగ్రహాలు తూప్రాన్ పట్టణంలోనే ఏర్పాటు చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● మెదక్ కల్చరల్: మెదక్ జిల్లా కేంద్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వీర హనుమాన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం ఉదయం మహిళలు, భక్తులు లలిత సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● నర్సాపూర్: పట్టణంలో పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో భారీ వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం చత్రపతి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, బీజేపీ మాజీ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, అరవింద్‌గౌడ్‌తో పాటు పలువురు దర్శించుకుని పూజలు చేశారు.

● చేగుంట/చిన్నశంకరంపేట/రేగోడు/పెద్దశంకరంపేట/పాపన్నపేట/హవేళిఘణపూర్/రామాయంపేట/ కౌడిపల్లి/మనోహరాబాద్/మాసాయిపేట/వెల్దుర్తి: ఆయా మండలాల్లో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలుచోట్ల బ్యాండ్ మేళాలతో శోభాయాత్రలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో ప్రత్యేకంగా తీర్చిద్దిన మండపాల్లో కొలువుదీరిన వినాయక ప్రతిమల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు, హోమాలు నిర్వహించారు. పలు మండపాల వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు రేగోడు హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి శోభాయాత్ర అందరినీ ఆకట్టుకున్నది. గణేష్ గడ్డ వద్ద భారీ గణనాథుని ప్రతిష్ఠించారు. రామాయంపేట పట్టణంలోని వివేకానంద విద్యాలయంలో పర్యావరణహిత మట్టి గణపతిని ప్రతిష్ఠించారు.


చిన్నశంకరంపేటలో వినాయక మండపంలో పూజలు చేస్తున్న భక్తులు


రేగోడు భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పూజలు


పెద్దశంకరంపేట: మాధవనగర్‌కాలనీలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


హవేళిఘణపూర్‌లో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి మున్సిపల్ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్ పూజలు


కౌడిపల్లి: సదాశివపల్లిలో చిన్నపిల్లలు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద పూజలు


మనోహరాబాద్: కోనాయపల్లిలో వినాయక మండపం వద్ద గ్రామస్థుల పూజలు


వెల్దుర్తి మండల పరిధిలోని ఎలుకపల్లి గ్రామంలో కొలువుదీరిన వినాయకుడికి భక్తుల పూజలు

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌కు సత్కారం

పుల్‌కల్, సెప్టెంబరు 8: చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహను ఘనంగా సత్కరించారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డును అందుకున్నారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నరసింహను బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు జోషి శ్రీపాద్, రజనేష్, సురేష్ శ్రీపాద, ప్రసన్నలక్ష్మి, సునీత, నరేందర్, పల్లె ప్రభుకుమార్‌గౌడ్, మహేష్, వెంకటేశం, సంతోష్, విజయలక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ నూతన అధ్యక్షుడికి అభినందనల వెల్లువ


పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తదితరులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 8: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మెదక్ సీనియర్ కాంగ్రెస్‌నేత మ్యాడం బాలకృష్ణ ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

● నర్సాపూర్: పీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు ముఖ్యనాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ తదితరులు నూతన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

● మనోహరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం మనోహరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ ర్యాకల కృష్ణగౌడ్, సత్యనారాయణ, లద్దివీర్ల శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్‌లో మహేష్‌కుమార్‌గౌడ్ ఇంట్లో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను ఆదరిస్తుందన్నారు. బీసీ బిడ్డను గుర్తించి పార్టీ పగ్గాలు చేతిలో పెట్టిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

అంత్యక్రియలకు త్రిషదామోదర్ ఆర్థిక సహాయం

పుల్‌కల్, సెప్టెంబరు 8: మండలంలోని కోడూరులో ఓ వృద్దురాలి అంత్యక్రియలకు కాంగ్రెస్ యువ నాయకురాలు త్రిషదామోదర్ ఆర్థికసాయమందించారు. గ్రామానికి చెందిన నిరుపేద సగ్గల్ల బుజ్జమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు ఉన్నప్పటికీ, ఆయన మానసిక పరిస్థితి బాగాలేకపోగా రోజు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని యువజన కాంగ్రెస్ నాయకుడు ఆత్మారి రవీందర్ కాంగ్రెస్ యువ నాయకురాలు త్రిషదామోదర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె అంత్యక్రియల కోసం రూ. 10వేల సాయాన్ని మృతురాలి కుమారుడికి అందజేశారు.

కార్మికుడి కుటుంబానికి తోటి కార్మికుల చేయూత

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 8 : సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేసే కార్మికుడు కుమ్మరి రమేష్ అకాల మరణం చెందగా తోటి కార్మికులు రమేష్ కుటుంబానికి చేయూతనందించారు. తోటి కార్మికులు, మిత్రులు సుమారు 97 మంది ఒక రోజు వేతనం రూ. 38,800ను రమేష్ కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేశారు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలోని రమేష్ ఇంటికి ఆదివారం వెళ్లి డబ్బులు అందించారు.

క్రిష్ణాపూర్‌లో క్లినిక్, మెడికల్‌షాపు సీజ్

కల్హేర్, సెప్టెంబరు 8: మండల పరిధిలోని క్రిష్ణాపూర్‌లో నిర్వహిస్తున్న ప్రైవేట్‌క్లినిక్‌తో పాటు పక్కనే ఉన్న మెడికల్‌షాపును నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేశ్వర్ శనివారం సీజ్ చేశారు. మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన బేగారి అనిల్, మంజుల దంపతుల మూడు మాసాల పాపకు క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ ఎండీ అలీ తన క్లినిక్‌లో వైద్యం చేస్తుండగా పాప మరణించింది. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే పాప మరణించిందని బాధితుల తరపు బంధువులు, గ్రామస్థులు ఆర్‌ఎంపీ అయన కుటుంబ సభ్యులపై దాడికి యత్నించిన విషయం విదితమే. ఈ విషయమై పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో స్పందించిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు క్రిష్ణాపూర్‌లోని క్లినిక్‌ను, మెడికల్‌షాపును డిప్యూటీ డీఎం హెచ్‌వో రాజేశ్వర్ సీజ్ చేశారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులపాత్ర కీలకం


సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ట్రస్మానాయకులు

జహీరాబాద్, సెప్టెంబరు 8:సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని సెట్విన్ కార్పొరేషన్‌చైర్మన్ గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్‌లోని బసవవేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు అత్యుత్తమైన గౌరవం ఉంటుందన్నారు. వృత్తినే దైవంగా భావిస్తూ అంకితభావంతో పనిచేసేది ఉపాధ్యాయుడు మాత్రమేనని కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సన్మానించడంపై ట్రస్మా పనితీరును ఆయన అభినందించారు. అనంతరం మండల విద్యాధికారి బస్వరాజ్, పట్టణ ఎస్ఐ.కాశీనాథ్, వక్త భాస్కర్‌యోగి, జిల్లా ట్రస్మా నాయకులు తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల్లో అంకితభావంతో పనిచేయాలన్నారు. పలువురు ఉపాధ్యాయులకు ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు క్రిష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, చంద్రశేఖర్, వెంకటయ్య, ఆయా పాఠశాలల నిర్వాహకులు,ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు. శ్రామిక్‌విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, అధికారులు పాల్గొని పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కో ఆపరేటివ్ సొసైటీ రైతుల రుణమాఫీ ఎప్పుడు?

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 8 : సీడెడ్ కో ఆపరేటివ్ సొసైటీలో ఉన్న రైతుల రుణాలను ఇంకెప్పుడు మాఫీ చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 16 సీడెడ్ కో ఆపరేటివ్ సొసైటీలో 8 వేల మంది ఉన్నారని, వీరికి రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్‌బీహెచ్, ఎస్‌బీఐ బ్యాంకుల్లో రుణాలను రెన్యూవల్ చేయకపోవడం వల్ల రైతుల రుణాల మాఫీ కాలేదని, డీసీసీ బ్యాంకు పరిధిలో ఉన్న కో అపరేటివ్ సొసైటీ రుణాలన్నీ మాఫీ అయ్యాయని అన్నారు. వెంటనే పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహులు, నాయకులు శ్రీనివాస్, రాజయ్య, మల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడిగా రాజు

సదాశివపేట, సెప్టెంబర్ 8: సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్లబజార్ నూతన అధ్యక్షుడిగా గంధిగె రాజు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక బసవేశ్వర మందిరంలో 2024-26 నూతన కార్యవర్గాన్ని సమాజం జిల్లా బాధ్యులు గౌరి శంకర్, కూర మల్లేశం, సిందోల్ గుణాకర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అన్నిశెట్టి జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా సిందిర్కేరి వినోద్‌కుమార్, కోశాధికారిగా అమ్రాదిరాచన్న ఎన్నికయ్యారు.

గణేష్ మండపాల వద్ద జాగ్రత్తగా ఉండాలి: ఎస్ఐ

రేగోడు సెప్టెంబరు 8: మండలంలోని గణేష్ మండపాల వద్ద నిర్వాకులు జాగ్రత్తగా ఉండాలని రేగోడు ఎస్ఐ పోచయ్య తెలిపారు. వర్షాలకు మండపాలు తడిసిపోయి ఉంటాయని, విద్యుత్ సరఫరాపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనాలపై ఒక్కరోజు ముందుగా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసుల సూచనలు పాటించి సహకరించాలన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


బండపోసన్‌పల్లిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

వెల్దుర్తి, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని శెట్టిపల్లి, రామాయిపల్లి, బండపోసన్ పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి రాజిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు శ్వేత, రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్‌గౌడ్, మల్లేశం, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల వద్ద మద్యపానంపై చర్యలు తీసుకోవాలి

పాపన్నపేట, సెప్టెంబరు 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయం వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పద్మారావు అన్నారు. శనివారం ఆలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో కిరణ్, ప్రభాకర్, కృష్ణ, వినోద్, ఆనంద్ ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

కొండాపూర్, సెప్టెంబరు 8: ఇటీవల భారీ వర్షాలకు ఇళ్లు కూలిన పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. అదివారం మల్కాపూర్‌లో పార్టీ సభ్యులతో కలిసి సమస్యలపై చర్చించారు. మండల వ్యాప్తంగా భారీ వర్షాలతో సాగుపై అపార పంటనష్టం వాటిల్లిందన్నారు. వర్షాలకు పూర్తిగా కూలిపోయిన సలీం ఇంటిని మూడు రోజులుగా తహసీల్దార్, రెవెన్యూ అధికారులు సందర్శించకుండా, బాధితులకు నష్టపరిహారం చెల్లిచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పేదల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజయ్య, బాబురావు, అర్జున్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం ఏర్పాటు

మాసాయిపేట సెప్టెంబర్ 8: మాసాయిపేట మండల నూతన కార్యవర్గాన్ని పీఆర్టీయూ సంఘం జిల్లా సమావేశంలో ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా బియ్యని శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఎంకోజి నవీన్ కుమార్ అసోషియేట్ అధ్యక్షుడిగా శ్రీశైలం, మహిళా అధ్యక్షురాలిగా బాలమణి, మండల కార్యదర్శిగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.